క్లుప్తంగా

'ఆడుదాం ఆంధ్ర' విజయవంతం చేద్దాం



అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ మల్లికార్జునరావు

ఉండి: ఉండిలోని మండల పరిషత్ కార్యాలయంలో డీపీఓ మల్లికార్జునరావు గురువారం నియోజకవర్గ స్థాయిలో విద్య, వైద్యం, రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుందని, అందుకు గాను ఈ నెల 26వ తేదీ నుంచి నిర్వహించే ఆటల పోటీలపై అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అలాగే జనవరి 1వ తేదీ నుంచి నిర్వహించే ఫేజ్–2 వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమం పైనా బూత్ లెవెల్ అధికారులు అప్పగించిన పనిని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. అర్హులైన కొత్త ఓటర్లు నమోదుతో పాటు డబుల్ ఎంట్రీలు, మరణాలను గుర్తించి వాటిని నిబంధనల ప్రకారం తొలగించాలని సూచించారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పీఈటీలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ పథకాల లబ్ధి



భీమవరం 28వ వార్డులో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక 28వ వార్డులో ఈ రాష్ట్రానికి మళ్లీ జగన్ ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం వార్డు ఇంచార్జ్ సుంకర బాబురావు ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా డిస్‌ప్లే ఆవిష్కరించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అక్కడ జరిగిన సభలో నల్లం రాంబాబు, నాయకులు కామన నాగేశ్వరరావు, గంటా సుందర్ కుమార్, పాలివేలి మంగ, మెట్ల మురళి, నందమూరి ఆంజనేయులు, రేవూరు గోగురాజు, పాలపర్తి జోనా, కానబోయిన వెంకటరమణ, తుళ్లూరు చంటి, అల్లూరి నాగవల్లి, కె.విజయదుర్గ, పతివాడ రాజేంద్ర, పైపూరి సూరిబాబు, సర్వేపల్లి శ్రీను, బుద్ధవరపు రామకృష్ణ వర్మ పాల్గొన్నారు.

కోరుకొల్లులో ఇళ్ల పట్టాల పంపిణీ



కోరుకొల్లులో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంతెన యోగేంద్ర కుమార్

పాలకోడేరు: ఇచ్చిన, ఇవ్వని హామీలను సైతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఏపీ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ తణుకు నియోజకవర్గ పరిశీలకులు మంతెన యోగింద్ర కుమార్ అన్నారు. గురువారం కోరుకొల్లులో సీఎం వైఎస్ జగన్ పుట్టిన వేడుకలను నిర్వహించారు. బాబు మాట్లాడుతూ పేదలు ఆర్థిక స్వావలంబన పొందే విధంగా సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పథకాలను పారదర్శకంగా అర్హులకు అందేలా సచివాలయం వ్యవస్థ, వాలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. ఇళ్ళు లేని నిరుపేదలకు దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో ఇస్తానన్న మాట నిలబెట్టుకున్నారు అన్నారు. అనంతరం 41 మంది పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు, సర్పంచ్ మంతెన భారతీ, చేకూరి చంటిరాజు, మైప సర్పంచ్ గొట్టుముక్కల జయంతి తిరుపతి రాజు, దేవాలయ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా సైన్స్ ఫెయిర్

భీమవరం అర్బన్: చినఅమిరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం, శనివారంలలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి వీఏజెడ్ శ్యామ్ ప్రసాద్ గురువారం చెప్పారు. ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు వ్యక్తిగత, గ్రూప్, ఉపాధ్యాయుల సైన్స్ ఫేర్ తదితర మూడు కేటగిరీల్లో ఎగ్జిబిషన్‌లు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో 19 మండలాల్లో మండల స్థాయిలో సైన్స్ ఫేర్ ఎగ్జిబిషన్ నిర్వహించామన్నారు. ఒక్కో మండలం నుంచి మూడు ఎగ్జిబిషన్‌లు జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారన్నారు. రెండు రోజుల పాటు జరిగే జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో రోజుకు 57 ఎగ్జిబిషన్‌లు ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఎగ్జిబిషన్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

పేదల పెన్నిధి సీఎం జగన్

- ఊరూరా ఉత్సాహంగా సీఎం పుట్టినరోజు వేడుకలు
- పలు చోట్ల రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు



భీమవరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్



పెదఅమిరంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న రామరాజు, శ్రీనివాసరాజు, పార్టీ నాయకులు

భీమవరం (ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పెన్నిధిగా, సంక్షేమ ప్రదాతగా నిలిచారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలను భీమవరంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు వేడుకల్లో భాగంగా స్థానిక త్యాగరాజు భవనంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. 87 యూనిట్లు రక్తాన్ని సేకరించి భీమవరం ప్రభుత్వ ఆస్పత్రికి అందించారు. అలాగే ఎమ్మెల్యే కేక్ కట్ చేసి సీఎంకు పార్టీ నాయకులతో కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజును పండగలా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. సంక్షేమ పాలనను చిత్తశుద్ధితో అన్ని వర్గాల ప్రజలకు అందిస్తూ వారి గుండెల్లో వైఎస్ జగన్ నిలిచారన్నారు. సీఎంకు ప్రజలు, భగవంతుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో పేదలకు మేలు చేస్తున్న సీఎంపై దుష్టశక్తులైన చంద్రబాబు, పవన్, లోకేష్‌ల చూపు ఉండకూడదని దేవుడిని ప్రార్థించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రికి ప్రజల అండదండలు పూర్తిగా ఉన్నాయన్నారు. చంద్రబాబు పవన్ కలిసి మరోసారి ప్రజలను మోసం చేయడానికి మోసపూరిత హామీలను ఇస్తున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లిబాబు, ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు, పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు గుడూరి ఉమాబాల, పార్టీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ యూత్, విద్యార్థి విభాగం నాయకుడు చిగురుపాటి సందీప్ ఆధ్వర్యంలో భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కోడే యుగంధర్, తోట భోగయ్య, పేరిచర్ల సత్యనారాయణరాజు పాల్గొన్నారు. భీమవరం 29వ వార్డు ప్రకాష్ నగర్ యానాదికాలనీలో దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ ఆధ్వర్యంలో పేదలకు భోజనం, పండ్లు, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

గొల్లవానితిప్పలో..

భీమవరం అర్బన్: గొల్లవానితిప్పలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ పెనుమాల నరసింహస్వామి మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్ పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎంతో లబ్ధి చెందారన్నారు. సంక్షేమ పథకాలు అందించడంలో అవినీతి, అక్రమాలు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. అటువంటి ప్రజా నాయకుడు వైఎస్ జగన్‌ను వచ్చే ఎన్నికలల్లో గెలిపించేంత వరకు ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. సాదే నాగరాజు, బుంగా సురేష్, మాదాసు ఏసు, చాబత్తుల కిరణ్, రొంప చినబాబు, బుంగా కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీని గడగడలాడించిన ధీరోదాత్తుడు

వీరవాసరం: ఢిల్లీ కోటలను గడగడలాడించిన ధీరోదాత్తుడు సీఎం వైఎస్ జగన్ అని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. వైఎస్ జగన్ పుట్టినరోజు సందర్భంగా గురువారం వీరవాసరం, నవుడూరుల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. సచివాలయాల వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించిన దార్శనికుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రథసారథి, జననేత వైఎస్ జగన్ మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని భారీ కేక్‌లను కట్ చేశారు. నవుడూరు జంక్షన్‌లో ఉన్న ఆసుపత్రిలో పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్‌కుమార్, గొలగాని సత్యనారాయణ, మండల కన్వీనర్ కడలి ధర్మారావు, నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, గెద్దం భాస్కరరావు పాల్గొన్నారు. రాయకుదురు గ్రామ సచివాలయంలో గ్రామ వలంటీర్ల ఆధ్వర్యంలో సీఎం జన్మదిన వేడుకలు గురువారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గెద్దం భారతి మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా ప్రజలందరికీ పథకాలు, సంక్షేమం పూర్తిస్థాయిలో అందజేయాలనే సదుద్దేశంతో గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేశారన్నారు.

సంక్షేమ ప్రదాత.. సీఎం వైఎస్ జగన్

కాళ్ల: సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలను మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పెద అమీరం పార్టీ క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సమక్షంలో రక్తదాన శిబిరం, వృద్ధులకు దుప్పట్లు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన టీటీడీ బోర్డు మాజీ మెంబర్ గోకరాజు రామరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి కేక్ కట్ చేసి సీఎం వైఎస్ జగన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీ నాయకులు యువకులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రామరాజు, శ్రీనివాసరాజు మాట్లాడుతూ సంక్షేమ పాలన అందించి సీఎం వైఎస్ జగన్ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం పొందారన్నారు. ఆయన పాలనలో ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వారు ఆకాంక్షించారు. ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీలు పెనుమత్స విశ్వనాథ రాజు, ఇందుకూరి శ్రీహరిరాజు, కటారి విజయలక్ష్మి, భూపతిరాజు చంటి రాజు, జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, పెద్దిశెట్టి లక్ష్మి తులసి, రణస్థుల మహంకాళి, ఆకివీడు ఏఎంసీ చైర్మన్ షేక్ రసూల్ బీబీ, పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు, వేగేశ్న జయ రామకృష్ణంరాజు, సాగిరాజు హరి వర్మ, నాలుగు మండలాల కన్వీనర్లు, సొసైటీ చైర్మన్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. అదేవిధంగా డెమొక్రటిక్ అసోసియేషన్ పిలుపుమేరకు గ్రామ వార్డు సచివాలయాల్లో సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి జోసెఫ్ కిషోర్ తెలిపారు. మాలవానితిప్పలో కేక్ కట్ చేసి ఆయన మాట్లాడుతూ గ్రామ వార్డు, సచివాలయ ఉద్యోగులలో సీఎం వైఎస్ జగన్ వెలుగులు నింపారన్నారు. కార్యదర్శి జి.రాజ్యలక్ష్మి, జి.కెల్విన్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కునపరాజు కృష్ణరాజు, నాయకులు బొడ్డు శివాజీ, సచివాలయ సిబ్బంది, ఐ.సుబ్బారావు, బి.మురళి, వి.చందు, ఎస్ రామాంజనేయులు పాల్గొన్నారు.

సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్

పాలకోడేరు: చిన్న వయసులోనే వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యి, సుపరిపాలన అందిస్తూ, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. గురువారం కొండేపూడిలో సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీపీ భూపతిరాజు చంటి రాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, పేదలకు చీరలు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. సర్పంచ్ చింతపల్లి వెంకట నారాయణ, పార్టీ మండల అధ్యక్షురాలు కటిక శ్రీదేవి, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, బొక్కా రాంబాబు, సర్పంచులు ఇంజేటి మరియమ్మ, జంగం సూరిబాబు, కడలి విజయలక్ష్మి, ఎంపీటీసీ పాలా జ్యోతి, పాలా రాధాకృష్ణ, పాండురంగారావు, ఆరేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నను గెలిపించుకుంటాం



ఆకివీడు అమృతరావు కాలనీలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న జామి హైమావతి

ఆకివీడు: సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలను మండలంలోని గురువారం పండుగలా జరుపుకున్నారు. పేదలకు దుప్పట్లు, పండ్లు, భోజనం అందజేశారు. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాళింగగూడెంలో సర్పంచ్ గురువెల్లి అన్నపూర్ణ కేక్ కట్ చేసి దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. చినకాపవరంలో కేక్ కట్ చేసి దుప్పట్లు సర్పంచ్ నాతిరెడ్డి ఆదిలక్ష్మీ, అన్నవరం, కత్తుల శ్రీను పంపిణీ చేశారు. ఆకివీడులో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ మళ్ళీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగనే రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ ఎస్కే.రసూల్‌బీబీ, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, మండల బూత్‌కన్వీనర్ అంబటి రమేష్, జేసీఎస్ కన్వీనర్ శిరపు శ్రీనివాస్, గుండా సుందరరామనాయుడు పాల్గొన్నారు.

సందడిగా జగనన్న జన్మదిన వేడుక



ఉండిలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉండి: సంక్షేమ పాలనతో తమ జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును మండలంలో ఊరువాడ పండుగ వాతావరణంలో సందడిగా నిర్వహించారు. ఉండి రిజిస్ట్రార్ ఆఫీస్ సెంటర్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణ రాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ, సర్పంచ్ కమతం సౌజన్యబెనర్జీ, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్ కట్ చేసి సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ సంక్షేమ పాలన అందించిన సీఎం వైఎస్ జగన్‌ను వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎం చేసుకోవాలన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను కుటుంబ సభ్యుడిలా భావిస్తున్న ప్రజలు ఆయన పుట్టినరోజును ఎంతో ఘనంగా జరుపుకుంటున్నారన్నారు. జానపద కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, బొచ్చా అచ్చారావు, మునుకోలు సింహాచలం, కమతం బెనర్జీ, కలిదిండి సుబ్బతాతరాజు, బడుగు బాలాజీ పాల్గొన్నారు.



గొల్లవానితిప్పలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



వీరవాసరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పార్టీ నాయకులు



పెదఅమిరంలో రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న గోకరాజు రామరాజు, పాతపాటి శ్రీనివాసరాజు



ఆకివీడులో ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్ ఇంటి వద్ద పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



కొండేపూడిలో పేదలకు వస్త్రాలు, పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్



కొండేపూడిలో కట్ చేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, చిత్రంలో ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు



భీమవరంలో పేదలకు భోజనం, పండ్లు పంపిణీ చేస్తున్న గంటా సుందర్‌కుమార్, పార్టీ నాయకులు



భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేస్తున్న చిగురుపాటి సందీప్

విద్యా వ్యవస్థలో డిజిటల్ విప్లవం



బొండాడలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసిన దృశ్యం



ఉండి హైస్కూల్‌లో ఓ విద్యార్థికి ట్యాబ్ అందిస్తున్న దృశ్యం

కాళ్ల: విద్యా వ్యవస్థలో డిజిటల్ విద్యకు నాంది పలికిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఎంపీపీ పెనుమత్స శిరీష, ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజు అన్నారు. మండలంలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు టాబుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. బొండాడ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ విద్యకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రూ.30 వేల విలువైన ట్యాబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. కందుల హనుమ,మన్నే సోమేశ్వరరావు, పెనుమత్స రంగరాజు, మందపాటి రవి, కట్టా వెంకట్రావు, విశ్వేశ్వరరావు, కువ్వయ్య, ప్రధానోపాధ్యాయులు మోహన్‌రావు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రభుత్వ విద్యకు మహర్దశ

ఉండి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ విద్యావ్యవస్థకు మహర్దశ పట్టిందని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ మహంకాళి అన్నారు. ఎంఈఓ జ్యోతి ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం ఉండి జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయిలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ వైఎస్ జగన్ పాలనలో ప్రభుత్వ విద్యకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. సాంకేతికంగా విద్యార్థులను బలోపేతం చేసేలా 8వ తరగతి నుంచి ట్యాబ్‌లు ఉచితంగా పంపిణీ చేస్తూ ప్రభుత్వ విద్యను మరోమెట్టు ఎక్కించారన్నారు. సర్పంచ్ కమతం సౌజన్య, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్ వర్మ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, రణస్తుల మహంకాళి, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ విజేతలు వీరే..



భీమవరంలో సర్టిఫికెట్లతో చెకుముకి టాలెంట్ టెస్ట్ విజేతలు

భీమవరం: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికే 33 ఏళ్లుగా చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు చింతపల్లి ప్రసాదరావు అన్నారు. గురువారం భీమవరం పట్టణం, మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎం హైస్కూల్‌లో హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. సంబరాల సందర్భంగా నిర్వహించిన చెకుముకి పోటీల్లో విజేతల వివరాలను వెల్లడించారు. భీమవరం మండలంలో కొవ్వాడ హైస్కూల్ ప్రథమ, చినఅమిరం హైస్కూల్ ద్వితీయ, తాడేరు హైస్కూల్ తృతీయ స్థానాల్లో నిలిచాయి. అలాగే ప్రైవేట్ స్కూల్స్‌లో విశ్వకవి, విష్ణు, విజ్ఞాన భారతి వరుస స్థానాల్లో విజయం సాధించాయి. మున్సిపల్ స్కూల్స్‌లో పీఎస్ఎం గరల్స్ హైస్కూల్, ఏఆర్‌కేఆర్ హైస్కూల్, ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎం హైస్కూల్ తొలి మూడు స్థానాల్లో నిలవగా పట్టణంలోని ప్రైవేట్ స్కూల్స్‌లో భాష్యం ప్రథమ, ఆదిత్య ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నాయి. ప్రథమ స్థానంలో నిలిచిన నాలుగు స్కూల్స్ విద్యార్థులు జనవరి 7న భీమవరంలో నిర్వహించే జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొనాలని జేవీవీ కార్యదర్శి రేపాక వెంకన్నబాబు సూచించారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ కన్వీనర్లు ఎం.సోమేశ్వరరావు, ఎ.లోకేశ్వరరావు, అలుగు జాన్సన్, జ్యోత్స్న, రామభద్రరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకోడేరు: విద్యుత్ 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్, బంటుమిల్లి ఫీడర్, విస్సాకోడేరు ఫీడర్ పరిధిలో మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విస్సాకోడేరు, పెన్నాడ, గొరగనమూడి, శృంగవృక్షం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రూ.1.21 లక్షల నగదు స్వాధీనం

భీమవరం అర్బన్: గొల్లవానితిప్పలో గురువారం నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి తొమ్మిది మంది జూదరులను అరెస్టు చేసినట్లు భీమవరం రూరల్ ఎస్సై డి.సంజీవరావు చెప్పారు. నిందితుల నుంచి రూ.1.21 లక్షల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

భీమవరం: భీమవరం టిడ్కో విద్యుత్ కేంద్రం పరిధిలో గల 33 కేవీ లైన్లపై చెట్ల కొమ్మలు తొలగించే నిమిత్తం శుక్రవారం విద్యుత్ కేంద్రం పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం తెలిపారు. గాంధీనగరం, లెప్రసీ కాలనీ ఏరియాలకు ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

భీమవరం మండలంలో..

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్ల ఏర్పాటు నిమిత్తం శుక్రవారం పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం తెలిపారు. గొల్లవానితిప్ప, ఎల్‌వీఎస్‌పురం, సీఏడీ కంపెనీ, పల్లిపాలెం ఏరియాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.